

## వైభవంగా రథోత్సవం

చంద్రగిరి, అక్టోబర్ 31 ప్రభాతవార్త: ముక్కోటి ఉత్సవాలలో ఆది దంపతులైన శివపార్వతుల రథోత్సవం వైభవంగా జరిగింది. తొండవాడ స్వర్ణముఖీ నదీతీరాన వెలసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ముక్కోటి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం వేకువజామున స్వామి వారికి అభిషేకం జరిపించి, విశేష అలంకరణ గావించారు. ఉదయం 8 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను బంగారు ఆభరణాలు, విశేష అలంకరణలతో మంగళవాయిద్యాల మధ్య రథంపై ఆలయ ప్రదక్షిణలో ఆదిదంపతులు విహరించారు. రాత్రి 7 గంటలకు శివపార్వతులు కల్పతరువు వాహనంపై అధిష్టించి భక్తులకు దర్శనమిచ్చారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






కపిలేశ్వర ఆలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా శనివారం రుద్రహోమం ఆరంభమైంది. గతనెల నుండి పలు హోమాలు చేపడుతున్నారు. ప్రభాతవార్త - తిరుపతి

# ఇంకా కోలుకోని కళత్తూరు



రాయలచెరువును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

**కొనసాగుతున్న సహాయక చర్యలు**
**న గ్రామంలో ఎటు చూసినా బురదే**
**న పునరావాస కేంద్రాల్లోనే బాధితులు**
**న అంటు వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్**

కేవీబీ పురం, నవంబరు 8 ప్రభాతవార్త:
రాయలచెరువుకు గండి పడి తీవ్ర నష్టాన్ని మిగిల్చిన ఘటనల నుంచి కళత్తూరు గ్రామం కోలుకోలేదు. గ్రామంలో ఎటు చూసినా బురద కనబడుతోంది. గ్రామంలోని అన్ని ఇళ్లు, వీధులు బురద నీటితో రాళ్ళతో నిండిపోయాయి. యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు జరుగు తున్నాయి. వీధుల్లోని బురద, రాళ్ళను జేసీబీ యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు. ఇళ్ళను శుభ్రం చేసే పనిలో అగ్నిమాపక సిబ్బంది సహాయపడుతున్నారు. విరిగిన 60కిపైగా విద్యుత్ స్తంభాలను పునరుద్దరిస్తున్నారు. బాధిత గ్రామాలప్రజలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నం ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నీళ్ళ బాటిళ్ళను ఎప్పటికప్పుడు పంపిణీ చేస్తున్నారు. కొందరిని పునరావాస కేంద్రాలకు పంపించారు. గురువారం నుంచి బురద నీటితో తడిసిన బట్టలతోనే ఉన్న కొందరిని చూస్తే గుండె తరుక్కుపోతుంది. మృతి చెందిన కొట్టుకుపోయిన పశువుల వివరాలను పశు సంవర్థకశాఖ అధికారులు ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్నారు. సెలవుపై ఉన్న డాక్టర్ రామ్‌నాయక్ తన సెలవును రద్దు చేసుకుని తన బృందంతో కలసి ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. తాగునీటి శాంపిల్లను బోర్ల నుంచి తీసి మైక్రో బయాలజీ పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. అంటూ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గుర్తు పట్టలేనంతగా పంట పొలాలు వరద ఉధృతిలో కొట్టుకుపోయాయి. వాటి వివరాలను రెవెన్యూశాఖ అధికారులు సేకరిస్తున్నారు. వరద ఉధృతిలో కొట్టుకుని పోయిన పంట నష్టాల వివరాలను వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ బృందం సేకరిస్తోంది. సాగునీటి సునామీ ఉధృతిలో రాళ్లు, ఇసుక మేటలతో నిండి హద్దులు కనిపించకుండా పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్ మండలంలో సుడిగాలి పర్యటన చేసి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

**న గండిపడిన ఒళ్లూరు రాయలచెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్**

మండలంలోని పాతపాళెం వద్ద ఒళ్లూరు రాయలచెరువును పరిశీలించి, చెరువు గండిపడిన గల కారణాలను జిల్లా కలెక్టర్ వెంకటేశర్ ఆరా తీశారు. సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీ పురం మండలం గండి పడిన ఒళ్లూరు రాయలచెరువును ట్రైనింగ్ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలసి పర్యటించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేవీబీ పురం మండలంలోని ఒళ్లూరు గ్రామ పరిధిలో ఉన్న రాయలచెరువు కట్ట తెగిపోవడంతో గ్రామాల వరకు నీరు చేరి భారీ నష్టం జరిగింది. ఈ చెరువు పుత్తూరు రిజర్వు ఫారెస్టు ప్రాంతం నుంచి నీరు అందుకునే ఏరియా కలిగి ఉండి, దాని నీటి నిల్వ సామర్థ్యం సుమారు 0.8 టీఎంసీ(80 ఎంసీఎఫ్‌టీ) చెరువు కింద సుమారు 1200 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇది నాలుగు గ్రామాలకు సాగునీరు అందిస్తుందని తెలిపారు. ఈ ప్రమాదం మట్టి బలహీనత వల్ల చోటు చేసుకుందన్నారు. చెరువు బండ కింద ఉన్న మట్టి బలహీనంగా ఉండడంతో గ్రాడ్యువల్ సాయిల్ స్లిప్పేజ్ ఏర్పడి, నీరు బండపైకి చేరిందని తెలిపారు. ఉదయం 5 గంటల సమయంలో చేపలు పడుతున్న గ్రామస్తులు నీటిలో బురద కలుస్తున్నట్లు గమనించి సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సమాచారం ఇచ్చారని, వారు 6.30 గంటలసమయంలో చేరుకునే సరికి నీరు బండ మీదుగా ప్రవహించడం ప్రారంభమైందన్నారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి యంత్రాలు తెచ్చినా, నీటి ఫోర్స్ చాలా ఎక్కువగా ఉండడంతో కట్టను కాపాడలేకపోయారని తెలిపారు. గ్రామాల్లో రిలీఫ్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు, ఆహారం, అవసరమైన వస్తువులు అందించారని, జిల్లా పరిపాలన యంత్రాంగం మొత్తం ప్రాంతంలో శుభ్రపరిచే పనులు, చెత్త తొలగింపు చర్యలు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ ఘటనను ప్రభుత్వం విపత్తుగా పరిగణించి నివేదికను స్వీకరించి కలెక్టర్ ఆధ్వర్యంలో నష్టాల అంచనా(ఎన్యూమరేషన్) పనులు ఇంటింటికి జరుగుతున్నాయని, ప్రతి కుటుంబానికి పశువుల సంఖ్య, పంట నష్టం, గృహ సామగ్రి నష్టం మొదలైన వివరాలను సేకరిస్తున్నారన్నారు.

**న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం - కూరపాటి శంకర్‌రెడ్డి**

ప్రతి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని బాధిత గ్రామ ప్రజలకు సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు, రైతు విభాగం నాయకుడు గోపినాథ్‌రెడ్డి, వెంకట కృష్ణయ్య, సత్యవేడు నియోజకవర్గ యువత అధ్యక్షుడు లక్ష్మీపతి రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు నాలి బాబుయాదవ్‌లు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో పూర్తిగా తడిసిన రికార్డులు

*మండలంలోని రాయలచెరువు తెగిపోవడంతో కళత్తూరు దళితవాడ వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాలల్లోని గదుల్లో పూర్తిగా నీరు నిండిపోవడంతో పాఠశాలలో ఉన్న రికార్డులు, ఫర్నిచర్లు, విద్యార్థుల పుస్తకాలు, 40 సంవత్సరాలుగా ఉన్న విద్యార్థులకు సంబంధించిన రికార్డులు, బీరువాలు పూర్తి స్థాయిలో తడిసిముద్దయి బురదతో నిండిపోయింది. ఉపాధ్యాయులు గత రెండు రోజులైనా కూడా బురదతో ఉండడంతో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు నారాయణవనం, తిరుపతి, సత్యవేడు, వరదయ్యపాళెం, శ్రీకాళహస్తి తదితర పట్టణాల నుంచి పారిశుధ్య కార్మికులను రప్పించి బురదను తీసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. రికార్డులు ఒక్కటి కూడా పనికి రావని ఉపాధ్యాయురాలు, అంగన్‌వాడీ టీచర్లు లబోదిబోమంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు రికార్డులు పునర్విభజన రికార్డులు తయారు చేయించాలని కోరుతున్నారు.*



ఎర్రచందనం గోడౌన్లను

# సందర్శించిన డిప్యూటీ సిఎం

**ఎర్రచందనం స్టాక్ వివరాల రిజిస్టర్లు తనిఖీ**





రేణిగుంట నవంబర్ 8 ప్రభాతవార్త
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం రేణిగుంట మండలంలోని శేషాచలం అడవుల్లోని మామండూరు గెస్ట్ హౌస్, అటవీ ప్రాంతం, ఎర్రచందనం గోడౌన్లను సందర్శించారు. అడవిలో దాదాపు నాలుగు కిలోమీటర్లు ప్రయాణం చేసి రెండు కిలోమీటర్లు కాలినడకన తిరిగి ప్రతి చెట్టును పరిశీలించారు. అటవీ సంపదలపై అధికారులను ఆరా తీశారు. ఎర్రచందనం, కుంకుడు, తెల్ల మద్ది, వెదురు చెట్ల తో పాటు శేషాచలం అడవుల్లో తప్ప వేరే చోట పెరగని అరుదైన మొక్కలు, చెట్లను పరిశీలించి అధికారుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాలను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించి స్మగ్లింగ్ నిరోధక ఆపరేషన్, టాస్క్ ఫోర్స్, అటవీ అధికారులు సిబ్బందితో కలిసి నిర్వహించే కూబింగ్లపై సమగ్ర సమాచారాన్ని సేకరించారు. తిరుపతి జిల్లా మంగళం వద్ద ఉన్న ఎర్రచందనం గోడౌన్లను పరిశీలించారు. 8 గోడౌన్లలో ఉన్న స్టాక్ వివరాలను పరీక్షించారు. గోదాముల్లో ఉన్న ఎర్రచందనం స్టాక్ వివరాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. పట్టుబడిన దుంగలు అమ్ముడుపోయే వరకు ఒక్క దుంగ కనిపించక పోయినా ఉపేక్షించమని అధికారులను హెచ్చరించారు. ఎర్ర చందనం స్మగ్లింగ్ చేసే వాళ్ళ తాటతీస్తానన్నారు. 2019 నుంచి 2024 వరకు పెద్ద ఎత్తున ఎర్రచందనం స్మగ్లింగ్ జరిగిందన్నారు. అంచనా ప్రకారం ఆ ఐదేళ్ల కాలంలో 8 నుండి పదివేల కోట్ల ఎర్రచందనం స్మగ్లింగ్ జరిగిందని తెలిపారు. ఎవరు కూడా ఎర్రచందనం చెట్లు నరికే వృత్తిలోకి వెళ్ళకూడదు అన్నారు. ఇతర రాష్ట్రాల ఓడరేవుల ద్వారా ఎర్ర సంపద తరలిపోయే అంశంపై దృష్టి పెడతామన్నారు. అంతకుముందు ఆయన మామండూరు అటవీశాఖ పర్యాటక కేంద్ర విశ్రాంతి భవనం వద్ద వన సంరక్షణ సమితి చైర్మన్ కుమార్ స్వామి, ఉప చైర్మన్ హనీ తదితరుల స్వాగతానంతరం మొక్కలను నాటారు. ఉప ముఖ్యమంత్రి తో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అటవీ శాఖ అధికారులు, రెవిన్యూ అధికారులు, రాజకీయ ప్రతినిధులు, ఉన్నారు. రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, అర్బన్ సిఐ జయ చంద్ర రూరల్ సీఐ మంజునాథరెడ్డి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

# ఉగ్గుముడిలో విషాదం

సూళ్లూరుపేట, నవంబర్ 8 ప్రభాతవార్త



మృతిచెందిన వరలక్ష్మి, కుమారులు వర్షిత్ , ప్రశాంత్

సూళ్లూరుపేట మండల పరిధిలోని ఉగ్గుమడి గ్రామంలో శనివారం విషాదం చోటుచేసుకుంది. ఉగ్గుముడి వరలక్ష్మి (24) తన కుమారులు వర్షిత్ (4), ప్రశాంత్ (2)లను తీసుకుని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాధవయ్యతో వరలక్ష్మికి ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీకినఇద్దరు కుమారులు. కొద్దిరోజులుగా కుటుంబంలో కలహాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఇంట్లో అందరూ పనులకు వెళ్లిన సమయంలో వరలక్ష్మి తన ఇద్దరు పిల్లలను తీసుకుని బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. విగతజీవులైన తల్లి బిడ్డలను చూసి ఉగ్గుముడి గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఎస్సై బ్రహ్మనాయుడు సంఘటన ప్రదేశానికి వెళ్లి బావి నుండి మృతదేహాలను వెలికితీసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భక్తులతో పోటెత్తిన కాణిపాకం ఆలయం

# స్వర్ణరథంపై విహరించిన విఘ్ననాధుడు

కాణిపాకం, నవంబర్ 8 ప్రభాతవార్త:
కాణిపాకం వరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో శనివారం రాత్రి సిద్ది బుద్ది సమేతుడైన వరసిద్దుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు సంకటహర చతుర్ధి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ది, బుద్ది సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపే రీతిలో అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, చిట్టిబాబు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# కల్తీనెయ్యి కేసులో కీలక మలుపు!

**-సిట్ వివరాలపై హైకోర్టుకు వైవి**
**-సూత్రధారులెవరనే తేల్చడంలో వేగం**

*తిరుమల, నవంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:*
*శ్రీవారి లడ్డూతయారీలో కల్తీనెయ్యిసరఫరా చేసిన కేసులో సిట్ దర్యాప్తు వేగంగా సాగుతున్న తరుణంలో శనివారం టిటిడి మాజీచైర్మన్ వైవి సుబ్బారెడ్డి హైకోర్టును ఆశ్రయించడం కీలకపరిణామంగా మారింది. ఈ కేసులో ఇప్పటికే వైవి గత పిఎ చిన్నఅప్పన్నను సిట్ అరెస్ట్‌చేసి జైల్లో ఉంచింది. ఈ వ్యవహారంలో మాజీ ఛైర్మన్ అయిన వైవి సుబ్బారెడ్డి, ఆయన సతీమణి బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వాలని సిట్ అడగడం వైవిలో కొంత భయంపట్టుకుందనేది తెలుస్తోంది. తన వివరాలను సిట్ కోరిందని, దానిపై కొంత సడలింపుకోరుతూ శనివారం వైవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం సంచలనంగా మారింది. అయితే లావాదేవీలపై అనుమానం ఉంటే బ్యాంకుఖాతాలు కోరవచ్చనేది హైకోర్టుకు సిట్ నివేదిక ఇచ్చింది. కల్తీనెయ్యిపై సుబ్బారెడ్డి వ్యవహారంపై తనిఖీచేసేందుకే బ్యాంకు ఖాతాలు వివరాలు కోరామని, సుబ్బారెడ్డి పిటిషన్ కొట్టివేయాలని సిట్ హైకోర్టుకు విన్నవించింది. మరో సోమవారం ఈ విషయంపై ఇంకెలాంటి పరిణామాలు చోటుచేసుకోనున్నాయనేది హైకోర్టు న్యాయమూర్తి వెలువడించనున్న తీర్పుపై ఆధారపడిఉంది. ఇప్పటికే కల్తీనెయ్యి వ్యవహారం పలు మలుపులుతిరిగి టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పాత్ర వరకు సిట్ అధికారులు ఆధారాలు సేకరించారనేది సమాచారం. రానున్న వారంలో సిట్ చేతికి జిక్కే కీలక వ్యక్తులెవరనేది టిటిడిలో హాట్‌టాఫిక్‌గా మారింది.*

# కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా మార్చుతా : సిఎం

**కుప్పంలో ఏడు పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన**
**ప్రత్యక్ష..పరోక్షంగా 42వేలమందికి ఉద్యోగాలు.. రైతులు ఉద్యానవనపంటలపై దృష్టి పెట్టాలి !!**
**- నా జీవితంలో మరపురానిది ఈ రోజు .. కుప్పం అభివృద్ధిపై చర్చ జరగాలి !!**



కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శనియోజకవర్గంగా మార్చుతానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం కుప్పంలో రూ 2203కోట్ల పెట్టుబడులతో ప్రారంభంకానున్న ఏడు పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతి నుంచి వర్చువల్ విధానంలో శ ంకుస్థాపన చేశారు. అనంతరం పారిశ్రామికవేత్తలు, కుప్పం ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. తనను ఎనిమిదిసార్లు గెలిపించిన కుప్పంలో 22వేలమందికి ఉద్యోగాలు లభించేలా పరిశ్రమలకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని ఈ రోజు తన జీవితంలో మరపురాని రోజు అని పేర్కొన్నారు. కుప్పానికి త ్వరలోనే మరో 6339కోట్ల పెట్టుబడులతో మరో ఎనిమిది పరిశ్రమలు రానున్నాయని సిఎం ప్రకటించారు. ఈ పరి శ్రమల ద్వారా మరో 42వేలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కుప్పంలో పరిశ్రమలు, మౌలిక వసతులు, నిర్మాణాలపై దృష్టి సారించామన్నారు. కుప్పంలో మును ్ముందు బ్యాటరీ, మెడికల్ డివైజెస్, ఫుడ్ లాజిస్టిక్స్, ఫుట్‌వేర్ పరిశ్రమలు వస్తాయన్నారు. కుప్పాన్ని విద్యాకేంద్రంగా మలచేందుకు చర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే కేంద్రీయ విద్యాలయ, కృషి విజ్ఞానకేంద్రాలు ఏర్పాటవుతాయన్నారు. ప్రభుత్వపరంతో పాటు ప్రైవేట్ పరంగాను విద్యార ంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

**పరిశ్రమలుతెచ్చే బాధ్యత నాది :**

కుప్పానికి మరిన్నిపరిశ్రమలుతెచ్చే బాధ్యత తనది అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. వాటిని సద్వినియోగం చేసుకునే బాధ్యతలు ప్రజలదేనన్నారు. వచ్చే ఏడాది కల్లా కుప్పం రాష్ట్రంలోనే తొలిజీరో ల్యాండ్‌ఫిల్ నియోజకవర్గంగా మారుతోందన్నారు. ఈఏడాది చివరి కల్లా కుప్పంలో ఆధున్మిక స్మశాన వాటిక, కుప్పం సెంట్రల్ పార్క్ అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే ఏడాది మోడల్ బస్‌స్టేషన్, ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, డికె పల్లి పార్కులు అభివృద్ధి అవుతాయన్నారు. కుప్పంలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రజల్లో చర్చ జరగాలని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పంలో రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, కార్మికుల నమ్మకాలను నిజం చేయడంతో పాటు అభివృద్ధికి చర్యలుచేపట్టామన్నారు. సాగు, తాగునీటి అవసరాలకు 700 కి.మీలపైగా దూరం నుంచి కృష్ణాజలాలు తీసుకొచ్చామన్నారు. కుప్పం ప్రాంత రైతులు ఉద్యానవనపంటలు, సేంద్రీయ వ్యవసాయం, డెయిరీ రంగాలపై దృష్టి సారించాలని సిఎం సూచించారు. పారిశ్రామికవేత్తలు కూడా ఎఫ్‌పిఒలు మరింతగా స్థాపించాలన్నారు. పారి శ్రామికవేత్తలు తమలక్ష్యాలు నిర్దేశించుకుని గడువులోగా పనులు పూర్తి చేసి ఉత్పత్తులు మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ ప్రాజెక్ట్‌డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, సంస్థల యజమానులు, ప్రతినిధులు సంజయ్, సంజీవ్ గోయెల్, మనోజ్‌కుమార్, సతీష్, సుధాకర్, రమాదేవి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, స్థానిక నేతలు పాల్గొన్నారు.



కనక దాసు జయంతి సందర్భంగా తిరుపతి కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటిస్తున్న ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్

ప్రభాతవార్త- తిరుపతి కలెక్టరేట్

# భక్త కనకదాసు జీవితం అందరికీ ఆదర్శనీయం

## - జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు



**చిత్తూరు, నవంబర్ 8 ప్రభాతవార్త:**
భక్త కనకదాసు జీవితం అందరికీ ఆదర్శనీయమని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా బిసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో భక్త కనక దాసు జన్మదినంను పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దక్షి ణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీ, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వాసంతి, కలెక్టరేట్ ఎఓ వాసుదేవన్, బీసీ సంక్షేమశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భం గా జడ్పీ ఛైర్మన్ గోవింపద శ్రీనివాసులు మాట్లాడుతూ 1509-1609 కాలంలో భక్త కనకదాసు కర్నాటకలో గొప్ప భక్తుడు, ఆధునిక కవి, తత్వవేత్త, సంగీతకారుడు, స్వరకర్త అన్నారు. ఆయన రచ నలు, కీర్తనలు ప్రజలకు భక్తిని మానవత్వంను బోధించా యన్నారు. భర్త కనకదాసు చిన్నతనంలోనే నరసింహస్తోత్రం, రామధ్యాయ మంత్రం, మోహన తరంగిణి అనే కవిత్వాలను రచించారన్నారు. బ్రాహ్మణ పూజారులు కనకదాసు తక్కువ కులం వాడు కావడంతో ఆలయంలోకి ప్రవేశం కల్పించలేదన్నారు. వ్యాసరాయ స్వామిజీ వారి తోసంప్రదించికనకదాసునుఆలయంలోకిరమ్మనిఆహ్వానించాన్నారు.

**బీసీ నాయకులకు అవమానం**

భక్త కనకదాసు జన్మదినం పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన ఆయన జయంతి వేడుకల్లో బీసీ నాయకులకు తీరని అవమానం జరిగింది. భక్త కనకదాసు జన్మదినం పురస్కరించుకుని నిర్వహించే కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి బిసీ సంక్షేమ శాఖ అధికారులు జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, మేయర్ అముద, దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమసంఘ ఇన్‌ఛార్జీ పి.షణ్ము గం, బీసీ, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు తదితరులను ఆహ్వానించారు. ఈ మేరకు కార్యక్రమంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని నాయకులకు చెప్పిన అధికారులు శని వారం సెలవు దినం కావడంతో అధికారులు ముందుగానే భక్త కనక దాసు చిత్రపటానికి నివాళులు అర్పించి కార్యక్రమం ముగించేశారు. ఆపై వచ్చిన జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమసంఘ ఇన్‌ఛార్జీ పి.షణ్ముగం, బిజెపి నాయ కులు అట్లూరి శ్రీనివాసులు కార్యక్రమానికి తమను పిలిచి తాము రాకముందే అధికారులు కార్యక్రమం నిర్వహించి పూర్తి చేశారని, ఇలా తమలను అవమానించడం పద్ధతి కాదని వాపోయారు.

## రైలుకిందపడి యువకుడు ఆత్మహత్య

**గుడుపల్లె, నవంబర్ 8 ప్రభాతవార్త**
మండలంలోని సరిగిరిపల్లి గ్రామానికి చెందిన రాధాకృష్ణ కుమారుడు రాకేష్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కాగా రాకేష్ త ండ్రికి కళ్లు కన్పించవని ఇద్దరు చెల్లెళ్లకు వివాహం అయిందని సమాచారం. రాకేష్ అప్పులు సైతం విపరీతంగా చేసి ఆన్‌లైన్ గేమ్‌ల్లో పోగొట్టుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అతను ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేశారు.

## ప్రభుత్వ భూమి యథేచ్ఛగా కబ్జా

**- చోద్యం చూస్తున్న అధికారులు.. గ్రామస్తుల ఆగ్రహం**



***వి.కోట, నవంబర్ 8 ప్రభాతవార్త*** ప్రభుత్వ భూములు తమ కళ్లెదుటే కబ్జాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జవునిపల్లి గ్రామం కర్ణాటక సరిహద్దుల్లో ఉంది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ గుట్టపోరంబోకు భూమి పది ఎకరాల మేర ఉంది. ఈ భూమిపై కర్ణాటక వాసులు కన్నేశారు. పట్టపగలే మూడు రోజులుగా జెసిబి యంత్రాలతో గుట్టలు తొలగించి భూమి చదును చేస్తున్నారు.అయితే సంబంధిత విఆర్వో పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. విఆర్వో చేతికి తాయిలాలు అందడంతోనే ఉన్నతాధికారులకు తెలియకుండా ఈ వ్యవహారం సాగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ముంపు గ్రామ ప్రజలకు సహాయం

**శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త**



కెవిబిపురం మండలంలోని రాయల్‌చెరువు తెగటంతో అతలాకుతలమైన కళత్తూరు,దళిత వాడ, ఎస్ఎల్‌పురం, ఒళ్ళూరు, పాతపాళెం ప్రజలకు శనివారం వైకాపా నాయకుడు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు శనివారం తమ పార్టీ వారితో కలసి బాధితులకు దుప్పట్లు మధ్యాహ్నం భోజన పాకెట్లను అందించారు.వరదకు ఐదు గ్రామాల ప్రజలు సర్వసం కోల్పోయారని అంజూరు తారక శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేసారు. ఐదు గ్రామాల్లో దయనీయ స్థితి నెలకొందన్నారు.వరద వచ్చి మూడు రోజులు అయినా ఒక్కరోజు అధికారులు పరుగులు తీసారు తప్ప తరువాత పట్టించుకోలేదని అంజూరు తారక శ్రీనివాసులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి సమయాల్లో ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు,ఇన్‌చార్జిలు ఏమయ్యారన్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమాల్లో సూరిశెట్టి సంతన్ కుమార్, యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్,డేవిడ్, తేజు,సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## గుంటకిందపల్లిలో కోటి సంతకాల సేకరణ

**శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 8 ప్రభాతవార్త**



రాష్ట్ర వైకాపా నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్‌జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు శ్రీకాళహస్తి మండల వైకాపా అధ్యక్షుడు,మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి సారధ్యంలో శనివారం మండలంలోని గుంట కింద పల్లిలో పిపిపికి వ్యతిరేకంగా సంతకాల సేకరణను చేపట్టారు. వైద్యకళాశాలల్లో విద్యను సామాన్యులకు దూరం చేయటానికి ప్రభుత్వం కుట్రపన్నుతుందని దీనిని సంతకాల ద్వారా తమ నిరసనను తెలపాలని చెబుతూ సంతకాలను సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో వయ్యాల కృష్ణారెడ్డితో పాటు ఎస్‌సి సెల్ అధ్యక్షుడు పసల కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, సునరబమణ్యం, చందు తదితరులు పాల్గొన్నారు.

## సత్యవేడు పట్టణంలో ట్రాఫిక్ అవస్థలు

**ఎటు చూసినా పార్కింగ్...**

**సత్యవేడు, నవంబరు 8 ప్రభాతవార్త:**



సత్యవేడు బస్టాండ్ రహదారి ప్రైవేటు బస్సులకు బస్టాండ్‌గా మారడంతో స్థాని కులు పాఠశాలకు వెళ్లే పిల్లలు ప్రతి దినం ట్రాఫిక్ కష్టాలతో ఇక్కట్లు పడుతున్న పరిస్థితి. సత్య వేడు మీదుగా సత్యవేడు నుంచి తమిళనాడుకు బస్సులకు చెందిన ప్రైవేటు బస్సులు ఎక్కువగా ఉంది. ఈ బస్సులన్నీ ప్రతిరోజు సత్యవేడు మార్గంలో మూడు నుంచి ఐదు సార్లు ప్రయాణించవలసి ఉంది. ప్రతిసారి సత్యవేడుఓలకి వచ్చినప్పుడు బస్టాండ్‌లో అనుమతి లేకపోవడంతో తిరుపతి రోడ్డుపై పార్కు చేస్తున్నారు. సుమారు అర్థ గంట వరకు ఆగే ఈ బస్సులు వల్ల శ్రీసిటీ బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాల రద్దీ పెరిగే ఈ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. సత్యవేడు పట్టణంలో అటు కాళహస్తికి వెళ్లే రహదారిపై మరోచోట ఇదే పరిస్థితి నెలకొంటుంది. ఒకదాని తరువాత ఒకటి ప్రైవేటు బస్సులు రోజంతా రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తుంది. పోలీసులు అనేక పర్యాయాలు వారికి నోటీసులు జారీ చేసిన ప్రైవేటు బస్సుల తీరు మారని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రైవేటు బస్సుల ఈ తీరు వల్ల ట్రాఫిక్ కష్టాలు సత్యవేడు వాసులను పీడిస్తుంది. సత్యవేడు పట్టణానికి బైపాస్ రోడ్డు ఉన్నట్లయితే శ్రీసిటీ బస్సులన్నీ వాటిపై వెళ్లిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం తగ్గొచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## గణనాధుని సన్నిధిలో పలువురు హైకోర్టు న్యాయమూర్తులు

**కాణిపాకం, నవంబర్ 8 ప్రభాతవార్త:**



సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని శనివారం పలు రాష్ట్రాలకు చెందిన హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ఈమేరకు కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ కృష్ణకుమార్, జస్టిస్ జోషి, చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్‌కుమార్‌లు వేర్వేరుగా కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, చిట్టిబాబు,చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుని ఆశీస్సులతో సకలం శుభకరం

**తిరుపతి,నవంబర్ 8ప్రభాతవార్త:**



చవితి ఘడియల్లో వినాయకుని పూజలు చేసి స్వామివారి ఆశీస్సులందుకుంటే సకలం శుభం కలుగుతుందని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, వినాయకమహోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.శనివారం సాయంత్రం వినాయకసాగర్‌లోని వరసిద్ధివినాయకస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలుచేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, వాసుదేవరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డయబెటిక్ రెటీనోపతిపై అప్రమత్తత అవసరం

**తిరుపతిహెల్త్,నవంబర్11 ప్రభాతవార్త:** డయాబెటిక్ రెటీనోపతి ప్రారంభదశలో కంటే అభివృద్ధి చెందు తున్నప్పుడు దృష్టి ప్రభావితం చెందుతుందని,ప్రతిఒక్కరు దీనిపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రాళ్ళపల్లి సుధారాణి సూచించారు. శనివారం శ్రీసాయి సుధా కంటి ఆసుపత్రిలో సుధారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత రెటీనా వైద్యశిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మధుమేహం ఉన్నవారు ప్రతి మూడునెలలకు ఒకసారి తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ధూమ పానం, మద్యపానం వంటి అలవాట్లను సాధ్యమైనంతవరకు నిలిపివేసినప్పుడుడయాబెటిక్ రెటినోపతి బారినపడకుండా కంటిచూపుకోల్పోకుండా కాపాడుకోవచ్చని వివరించారు. అనంతరం 50 మందికి ఉచిత కంటిపరీక్షలు నిర్వహించారు. సిబ్బంది విశ్వనాథం, మహేష్, సునీత ,ద్వారక తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**సదుం, నవంబర్ 8 ప్రభాతవార్త**
మండల పరిధిలోని సదుం పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవీ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో, బూరగ మందలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలు కార్తీక శనివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఉదయం ఆర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం మహా నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామి వారినీ దర్శనం చేసుకున్నారు. బూరగ మంద లో ఆంజనేయ స్వామికి ఆకు పూజలు చేశారు.భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## నారాభువనేశ్వరిని సత్కరించిన వైవి రాజేశ్వరి

**చిత్తూరురూరల్, నవంబరు 8 ప్రభాతవార్త:**



లండన్‌లోని ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ నుంచి డిస్టింగ్విస్ట్ ఫెలోషిప్-2025 అవార్డు అందు కొన్న నారాభువనేశ్వరిని హైదరాబాదులో తెదేపా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వైవి రాజేశ్వరి దుశ్శా లువతో సత్కరించి అభినందించారు. ప్రజాసేవా రంగం, సామాజిక ప్రభావం, నాయకత్వం అంశాల్లో విశిష్టమైన సేవలందించినందుకు లండన్‌లో 2 ప్రతిష్టాత్మకమైన అవార్డులు అందుకోవడం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు.

## యువతకలలు సాకారం చేస్తున్న సిఎం చంద్రబాబు

**- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్**

**కుప్పం,నవంబర్ 8 ప్రభాతవార్త**



కుప్పం ప్రాంత యువత కలలను సిఎం చంద్రబాబు నాయుడు సాకారం చేస్తున్నారని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం సిఎం చంద్రబాబునాయుడుతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కుప్పం ప్రాంతంలో సుమారు 20-30వేలమంది యువతకు ఉపాధి కల్పించాలని నిర్ణయం తీసుకుని నేడు దానిని సిఎం చంద్రబాబునాయుడు నిజం చేస్తున్నారని అందుకు కుప్పం ప్రజల తరపున సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కుప్పానికి గేమ్‌ఛే ంజర్ లాంటి పరిశ్రమలు వచ్చాయన్నారు. అధికారంలో వచ్చిన 15 నెలల్లోనే 16 పరిశ్రమలు వచ్చాయన్నారు. కుప్పానికి హంద్రీ-నీవా కాలువలతో కృష్ణాజలాలు తీసుకువచ్చిన సిఎం నేడు ఏకంగా 2203కోట్లతో పరిశ్రమలకు శంకుస్థాపన చేయడం కుప్పం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికి విదేశాల్లో పర్యటిస్తూ పెట్టుబడులు తీసుకువస్తున్నారన్నారు. పరిశ్రమల ఏర్పాటుపై కుప్పంలో తొంభైవేల ఇళ్లకు కరపత్రాలు పంచామన్నారు. కుప్పంలో అధికారులు, తాము సమన్వయంతో పనిచేస్తున్నామని సిఎంకు వివరిస్తూ శిరస్సు వంచి ధన్యవాదాలు తెలిపారు.

## సిఎం కార్యక్రమం వీక్షణకు ప్రత్యేక స్క్రీన్లు

**కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు శనివారం కుప్పంలో ఏడు పరిశ్రమలకు వర్చువల్ విధానంలో శ ంకుస్థా పన చేశారు. ఈ కార్యక్రమం తిలకించేందుకు కుప్పం పట్టణంలోని బస్టాండ్, పొగురుపల్లి ఇం డస్ట్రియల్ పార్క్, పలార్లపల్లి, ఆదిత్యబిర్లా కంపెనీ ప్రాంగణం, శాంతిపురం, విజలాపురంలలో ఏర్పా ట్లు చేపట్టారు. పొగురుపల్లి ప్రాంగణం నుంచి ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆదిత్య బిర్లా ప్రాం గణం నుంచి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, పలార్లపల్లి అలీఫ్ సంస్థ ప్రాంగణం నుంచి కడ పి.డి. వికాస్ మర్మత్, శాంతిపురం నుంచి ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, విజలాపురం నుంచి పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు ఆయా సంస్థల ప్రతినిధులతో కలసి హాజరయ్యారు. కార్యక్రమం తిలకించేందుకు భారీ ఎల్ఇడి స్క్రీన్లు, టివిలను ఏర్పాటుచేశారు. ద్రవిడ వర్సిటీతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సైతం ఈ కార్యక్రమాన్ని తిలకించేలా చర్యలు చేపట్టారు.

***శాంతిపురం :*** సిఎం చంద్రబాబునాయుడు వర్చువల్ కార్యక్రమాన్ని ప్రజలు తిలకించేందుకు స్థానిక బస్టాండు లో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నేతలు విశ్వనాథనాయుడు,జనార్ధనరెడ్డి, ఎల్.జయరాంరెడ్డి, రమేష్, గోపాల్, బాలు, బిజెపి రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు కాశీనాథ్, మండల అధ్యక్షుడు గజేంద్ర, మహిళా నేతలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త** కుప్పం 132కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా ఆదివారం ఉదయం 6-10గంటల మధ్య విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని రెస్కో ఎండి సోమశేఖర్ తెలిపారు. కుప్పం పట్టణం, గ్రామీణమండలం, గుడుపల్లె మండలాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

## ఇంటింటా తిరిగి గృహమంజూరు పత్రాలు పంపిణీ



***కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త*** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పం మున్సిపాలిటీకి పిఎంఎవై 2.0పథకంలో 509ఇళ్లు మంజూరైన విషయం విదితమే. ఈనేపథ్యంలో లబ్దిదారులకు స్థానిక నేతలు నేరుగా లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, ఎఎంసి మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, నేతలు డికెపల్లి మణి, నబీఉల్లా, కౌన్సిలర్ వేలు, ఎఎంసి డైరెక్టర్ ఇర్ఫాన్, నేతలు అల్లాబకష్, సోమశేఖర్, నాగభూషణం, షహనాజ్, గనీఉల్లా, సుభాన్‌బాబు, ఉమాపతి, అంజద్, ఫరూక్, అస్లం, సతీష్, నాగభూషణం, కృష్ణప్ప, స్వామి పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలా ప్రైవేటీకరణ ఆపండి

**కోటి సంతకాల సేకరణలో ఎంపీపీ యుగంధర్ రెడ్డి**

**భాకరాపేట, నవంబర్ 8 ప్రభాతవార్త:**



చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ కోటి సంతకాల కార్యక్రమం ప్రారంభం చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణకు మంచి స్పందన వస్తోందన్నారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేయడం అంటే పేదలకు వైద్యం, దూరం చేయడమే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోహన్, జడ్పీటీసీ స్వరూపమహేంద్ర రెడ్డి, సర్పంచులు భూపాల్, శంకర్ రెడ్డి, రామూర్తి, విజయ్, మనోహర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కెసి హాస్పిటల్‌చే విద్యార్థులకు ఉచిత దంత వైద్యశిబిరం

**కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త**



కుప్పంలోని కెసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎండి డా॥ మంజునాథ్ ఆధ్వర్యంలో మండలంలోని నాయనూరు ప్రభుత ్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. పంటిసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డా॥ భవ్య వివరించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పేస్ట్, టూత్‌బ్రష్‌లు అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం**

## గృహ సంపర్క్ అభియాన్ కరపత్రాల ఆవిష్కరణ

**పుంగనూరు రూరల్, నవంబర్ 8 ప్రభాతవార్త**



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపనకు వందేళ్ల పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమం ప్రారంభమైంది. కొత్త ఇండ్లలో ఉన్న షిరిడి సాయి ధ్యాన కళా మండపం లో శనివారం గృహ సంపర్క్ అభియాన్ కరపత్రా లను ఆవిష్కరించారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరగనుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల్లో దేశభక్తి, సామా జిక సమైక్యత, ధర్మనిష్ట వంటి విలువలను ప్రోత్సహించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేయ నున్నట్లు తెలిపారు. ప్రజలు దేశ అభివృద్ధికి భాగస్వాములు కావాలని, సామాజిక ఐక్యతకు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ్ సేవకులు, స్థానిక ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్



**పుంగనూరు నవంబర్ 8 ప్రభాతవార్త**
పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ప్రాంగణంలో డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయమూర్తి ఆరిఫా షేక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శనివారం మీడియాతో మాట్లాడుతూ, ఇరుపక్షాల కక్షిదారులు పరస్పర రాజీతో సమస్యలను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ మంచి వేదికగా నిలుస్తుందని చెప్పారు. సత్వర న్యాయం అందించడంలో, వివాదాలను సులభంగా తీర్చడంలో ఈ అదాలత్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ ఆధారంగా పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగిం చుకోవాలని ఆమె సూచించారు.

## మనశ్వాసతో మనముండటమే ధ్యానం

**చౌడేపల్లి, నవంబర్ 8 ప్రభాతవార్త**



మనశ్వాసతో మనం కలసి వుండటమే ధ్యానమని తిరుపతి జిల్లా ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి రాజశేఖర్ అన్నారు. మండలంలోని పెద్దయల్లకుంట్ల పంచాయతీ మనుకూరమ్మగుట్ట వద్దగల మామిడితోటలో వెంగ ళపల్లి గ్రామస్తులు కార్తీక వనభోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. హార్ట్‌ఫుల్‌నెస్, రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిత్యం ఒత్తిడు లకు లోనవుతున్న ప్రస్తుత సమయంలో ప్రజలు ధ్యానం మీద ధ్యాస వుంచాలనీ, అప్పుడే ఆరోగ్యవంత జీవితాన్ని అనుభవిస్తామన్నారు. అనంతరం ధ్యానం వల్ల కల్గే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. శిక్షకులు చిలకపాటి శివశంకర్, మురళీధర్‌రెడ్డి, డాక్టర్ మానస, శ్రీనివాసులు, చంద్రశేఖర్, రామకృష్ణ, యశోద, ఊటూరు చెంగల్రాయప్ప, శ్రీరాములు, నారాయణరెడ్డి, వెంగళపల్లి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో రాష్ట్ర వ్యవసాయశాఖ డిప్యూటీ సెక్రటరీ



**కాణిపాకం, నవంబర్ 8 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయశాఖ డిప్యూటీ సెక్రటరీ డి.హరిత శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయంలో రాజగోపుం వద్ద ఆలయ ఏఈఓ రవీంద్రబాబు,అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలమనేరుకు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

**చిత్తూరు, నవంబర్ 8 ప్రభాతవార్త:**
డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆదివారం పలమనేరు రానున్నారు. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆదివారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం నుండి బయలుదేరి ఉదయం 10.35 గంటలకు పలమనేరు మండలం పెంగరగుంటకు చేరుకుంటారు. అక్కడి నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి ఉదయం 10.50 గంటలకు ముసలిమడుగు ఏనుగు శిబిరం చేరుకుని మానవ వన్యప్రాణి ఘర్షణ నిర్వహణ, కుంకీ ఏనుగుల సందర్శన కేంద్రంను డిప్యూటీ సిఎం సందర్శించి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం డిప్యూటీ సిఎం కుంకీ ఏనుగుల శిబిరం, గజారామము నగర వనంను ప్రారంభిస్తారు. అనంతరం డిప్యూటీ సిఎం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ముసలిమడుగు నుండి పెంగరగుంట హెలిప్యాడ్ చేరుకుని తిరుపతి విమానాశ్రయంకు బయలుదేరి వెళ్ళారు.

## భక్త కనకదాసుకు ఎస్పీ తుషార్ డూడి నివాళి



**చిత్తూరుహెల్త్, నవంబర్ 8 ప్రభాతవార్త:** భక్త కనకదాసు జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ తుషార్ డూడి భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 1059 సంవత్సరంలో భక్త కనకదాసు కర్నాటక రాష్ట్రంలో జన్మించి కవి, తత్వవేత్త, సామాజిక సంస్కర్తగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. భక్త కనకదాసు బోధనలు ఇప్పటికీ సార్థకమే అన్నారు. సమానత్వం, దయ, సత్యం, సేవ ఆయన సందేశమని, ఇవి సమాజ అభివృద్ధికి పునాది లాంటివని ఆయన గట్టిగా నమ్మేవారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ మహబూబ్ భాషా, వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ఖో-ఖో బాలబాలికల జట్లు ఎంపిక

**బంగారుపాళ్యం, నవంబర్ 8 ప్రభాతవార్త:**



మండలం లోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జిల్లా బాలబాలికల ఖో-ఖో జట్ల ఎంపిక శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 240 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరి మధ్య జరిగిన పోటీల్లో విశేష ఆట ప్రతిభను కనబరచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు హెడ్మాస్టర్ రాజ్యలక్ష్మీ తెలిపారు. బాలికల విభాగం అండర్-17 నందు అమృత, హేమలత, గురువైష్ణవి, చంద్రిక, చెంచమ్మ, శివమల్లీశ్వరీ, దీక్ష, కీర్తన, రాజేశ్వరీ, స్నేహ రాగిణి, సరస్వతి, శిరీష, సుప్రియ, శ్రావణిలు ఎంపికయ్యారు. అలాగే బాలుర విభాగంలో వరుణ్, పృథ్వీ, లక్ష్మీప్రసాద్, చంద్రిక, సాగర్, యశ్వంత్, యోగీశ్వర్, ఢిల్లీ, భరత్, ప్రతాప్, జశ్వంత్, వినయ్, గౌతంరాజు, నితీష్‌రెడ్డి, లస్కర్‌లు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను మండల టిడిపి అధ్యక్షులు ఎన్‌పి ధరణీ, సర్పంచ్ మురళీ, ఎంఇఓలు నాగేశ్వరరావు, రమేష్, పిడి సురేష్ తదితరులు అభినందించారు.

## ఎగువ వనదుర్గాపురానికి శుద్ధి నీరు కలేనా ?

**పాలసముద్రం, నవంబర్ 8 ప్రభాతవార్త**



మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ కి చెందిన ఎగువ వనదుర్గాపురం గ్రామంలో ప్రభుత్వ నిధులతో సుమారు నాలుగు లక్షల వ్యయంతో నీటి ని శుద్ధి చేసే యంత్రం అమర్చడానికి నూతన షెడ్డును నిర్మించారు. షెడ్డు నిర్మించి నెలల గడుస్తున్న నీటి శుద్ధి యంత్రాన్ని మాత్రం ప్రారంభించలేదు. దేవుడు వరమిచ్చిన పూజారి వరం ఇవ్వడం లేదని విధంగా ఇదే గ్రామ పంచాయతీకి చెందిన ఒక వ్యక్తి బెంగళూరులో స్థిరపడి తన సొంత మండలానికి ఏదో మంచి చేయాలని ఉద్దేశంతో తన యొక్క కె.బి.ఆర్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ సంస్థ ద్వారా మండలం మొత్తం కలిపి 11 నీటి శుద్ధి యంత్రాలను వితరణ చేస్తానని చెప్పడంతో వాటి నిర్మాణం కోసం ప్రభుత్వ నిధులతో షెడ్లు నిర్మించారు. ఈ వ్యవహారం అంతా గత ప్రభుత్వంలో ఆ పార్టీకి సంబంధించి న ఒక వ్యక్తి తన అనుచరులతో ఈ షెడ్ల ను నిర్మాణం చేయించాడు. ఇంత మొత్తంలో నీటి శుద్ధి యంత్రాలను వితరణ చేసిన వ్యక్తి స్వగ్రామంలోనే ఇంకా శుద్ధి నీటి కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. నీటి శుద్ధి యంత్రాలు ఇచ్చినవారు ఇచ్చిన యంత్రాలు వాడుకలో ఉన్నాయా లేదా అని పర్యవేక్షణ చేయకపోవడం మరియు ప్రభుత్వ నిధులతో నిర్మించిన షెడ్లు వాడుకలో ఉన్నాయా లేదా అని అధికారుల పర్యవేక్షణ చేయకపోవడం వల్ల శుద్ధి నీటి యంత్రాలు వాడుకలోకి రాలేదు. మండలంలో ఇప్పటికే కొన్ని పంచాయతీలలో ఉప్పునీరు ఉండడంతో చాలామంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతూ డయాలసిస్ చేసుకుంటున్నారు. ఇలాంటి వారిని దృష్టిలో ఉంచుకొని అందరికీ పరిశుభ్రమైన నీరు అందించాలనే దృఢ సంకల్పంతో కే.బీ.ఆర్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ వారు నీటి శుద్ధి యంత్రాలను వితరణ గా ఇచ్చారు. వాటిని సద్వినియోగం చేసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యమని స్థానిక ప్రజలు వాపోతున్నారు. వన దుర్గాపురం గ్రామ ప్రజలు శుద్ధి నీటి కోసం ఎదురుచూస్తూ కలలు కంటున్నారు ఈ కల నెరవేరుతుందా లేక చివరికి కలగానే మిగులుతుందా వేచి చూడాలి.

# సినీరంగంలో కోట ఆణిముత్యం వాసు



కోట, నవంబర్ 8 ప్రభాతవార్త: కోటకు చెందిన లేంబూరు వాసుదేవాచారి అంచలంచెలుగా ఎదిగి విద్యారంగంలో ఓ స్థాయికి చేరుకుని అనంతరం తన జీవిత ప్రయాణం సినిమా రంగం వైపు మళ్లించాడు. కోటలో 10వ తరగతిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 7వ ర్యాంకు సాధించి తన ఉనికిని చాటుకున్నాడు. తర్వాత ప్రతిష్టాత్మకమైన ఏపిఆర్‌జెసి నాగార్జునసాగర్‌లో సీటు సాధించి ఇంటర్మీడియట్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు. ఎంఎస్సీ మ్యాథ మ్యాటిక్స్‌లో ఎస్‌వీ యూనివర్శిటీలో గోల్డ్‌మెడల్ సాధించి ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించి యూనివర్శిటీలో కీ పర్సన్ అయ్యాడు. డాక్టర్ మోహన్‌బాబు స్థాపించిన శ్రీ విద్యానికేతన్ సంస్థలో కంప్యూటర్స్ విభాగంలో హెచ్‌ఓడీగా బాధ్యతలు తీసుకుని విజయవంతంగా పనిచేశారు. సెంట్రల్ గవర్నమెంట్‌లో ఉద్యోగం వచ్చినా కొన్నేళ్ల పాటు పనిచేసి రాజీనామా చేసి నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు. అనంతరం గతంలో సత్యం కంప్యూటర్స్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా మెరిటోరియస్‌గా విధి నిర్వహణ చేసి పిహెచ్‌డి పూర్తి చేశారు. న్యూయార్క్ ఫిలిం అకాడమిలో డిఎఫ్‌టి చేశాడు. తర్వాత సినిమా ఇంటస్ట్రీలో ప్రయాణం మొదలుపెట్టారు. పలు సినిమాలకు దర్శకత్వ శాఖలో మరియు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేసి తన తన బాధ్యతలను నిర్వహించి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ మధ్యనే ఓ కన్నడ పెద్దహీరోకు కథ చెప్పి ఓకే అనిపించుకున్నారు. ప్రస్తుతం తాను నేషనల్ అవార్డుల కోసం స్వచ్ఛభారత్‌పై మరియు ఆర్టిఫిషియల్ బేస్డ్ ఎలక్షన్ సిస్టం మీద చాలా రీసెర్చ్ చేసి స్క్రిప్టులు తయారు చేసి అవి రెండు షూటింగ్స్‌తో కాకుండా పూర్తి ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ టూల్స్‌తో పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ రెండు స్క్రిప్టులతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రశంసలు పొందాలనే పనిచేస్తున్నారు. అవి ముగింపు దశలో ఉన్నాయి. ఈ స్క్రిప్టులతో చదువుకున్న మెరిటోరియస్ పర్సన్ సత్తా చూపించనున్నారు. అవి రెండు దేశానికే చాలా ఉపయోగకరం. అంతేకాకుండా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో మూవీ మేకింగ్ మీద వర్క్ షాప్ కండక్ట్ చేయబోతున్నారు. ఇవన్నీ విజయవంతమై వాసుదేవాచారి సినిమా ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసుకుని పలు సినిమాలకు దర్శకత్వం వహించే అవకాశం కలుగుతుంది.

## వైభవంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



గూడూరు, నవంబర్ 8 ప్రభాతవార్త: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవస్థానం మొదటి వార్షికోత్సవం సందర్భంగా అయ్యప్ప స్వామికి విశేష పూజలు జరిగాయి. పలు రకాల పుష్పాలతో అలంకరించిన ట్రాక్టర్ పై అయ్యప్ప స్వామిని నిలిపి మంగళ వాయిద్యాలు అయ్యప్ప స్వామి మాలధారణ భక్తుల భజనలతో పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా సాగింది భక్తులు అయ్యప్ప స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పేద ప్రజల వైద్య విద్యకు దూరం



గూడూరు, నవంబర్ 8 ప్రభాతవార్త: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల పేద ప్రజలు వైద్య విద్యకు దూరమవుతారని ఈ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం పునః పరిశీలన చేయాలని కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాల గుర్రం బాబు కోరారు. పట్టణంలోని ప్రైవేటు హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుర్రం బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తుందని దీనివల్ల పేదవారు డాక్టర్ విద్య చదవలేరని ఉన్నత వర్గాల వారు మాత్రమే డాక్టర్లు అవుతారని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు, భాస్కర్, ఫయాజ్, గౌస్ బాషా, ఇబ్రహీం, ఖలీల్, హరి గౌడ్, గీతా తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణముఖి నదికి నీరు విడుదల చేయాలి : ఎమ్మెల్సీ బల్లి



వెంకటగిరి, నవంబర్ 8 ప్రభాతవార్త: స్వర్ణముఖి నదికి మూడు టీఎంసీలు మీరు విడుదల చేయాలని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి కోరారు. జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ, జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్‌కు సూచించారు. రాపూరు, పొదలకూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకాళ హస్తి, తిరుపతి పట్టణముల త్రాగునీటి అవసరములకు, స్థానిక చెరువులు, పాడి పశువుల నీటి అవసరములకు ఐఏబీ సమావేశంలో 2 టీఎంసీలు నీటిని విడుదలకు ఇరిగేషన్ శాఖ వారు ప్రతిపాదించారు. అయితే ఈ ఐఏబీ సమావేశంలో ఎమ్మెల్సీ 3 టీఎంసీల నీటి విడుదలకు ప్రతిపాదించి, ముఖ్యంగా తిరుపతి, తిరుమల నీటి అవసరాల కోసం తిరుపతి జిల్లా సాగునీరు మరి తాగునీరు ఉపయోగపడుతుందన్నారు.

## ఎరువుల దుకాణాలపై చర్యలు ఏడిఏ



వెంకటగిరి, నవంబర్ 8 ప్రభాతవార్త: నిబంధనలు పాటించని ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకుం టామని ఏడిఏ అనసూయ తెలిపారు. పట్టణంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టిన బృందం నివేదికపై జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు పట్టణం లోని రెండు షాపుల ఎరువుల లైసెన్స్‌ను 10 రోజుల పాటు సస్పెండ్ చేసిఅలాగే స్టాక్ రిజిస్టర్లు అప్డేట్ చేయకపోవడం,తనిఖీ బృందం వచ్చినపుడు సహకరించకుండా షాపులు మూసుకుని పోవడం వంటి చర్యలకు సంబంధించి 4 షాపుల వారికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేసి వివరణ కోరడం జరిగిందని తెలిపారు. అలాగే అధిక ధరలకు యూరియా విక్రయించకుండా వెంకటగిరి పట్టణంలో వున్న యూరియా స్టాక్ అంతటిని వ్యవసాయశాఖ వారి పర్యవేక్షణలో ఎమ్మార్పీ రేటుకే రైతులకు విక్రయించడం జరిగింది. రబీ సీజనుకు ప్రతి ఎకరాకు 3 బస్తాల చొప్పున ఇచ్చేందుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన పడవలసిన అవసరం లేదని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారి సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలోశాఖ సిబ్బంది శివ,వినోద్, భాస్కర్ పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణ వ్యతిరేకంగా 12న ర్యాలీ: నేదురుమల్లి



వెంకటగిరి, నవంబర్ 8 ప్రభాతవార్త: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వెంకటగిరి నియోజకవర్గాలలో ఈనెల 11వ తేదీన చేపట్టవలసిన ర్యాలీలను 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. వైసిపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుల వారి ఆదేశాలతో ఈ నెల 12వ తేదీ నిర్వహిస్తున్నాము. నియోజకవర్గంలో వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల నాయకులకు 12వ తేదీ ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

## మురికి కాలువలో చెత్తను తీస్తున్న జెసిపి



వాకాడు, నవంబర్ 8 ప్రభాతవార్త: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మురికి కాలువల్లో చెత్త చెదారంను జెసిపి ద్వారా చెత్తను బయట తీశారు. మండల కేంద్రమైన వాకాడు పంచాయతీలో గత రెండు రోజులుగా డిప్యూటీ ఎంపీడీవో దేవా నందం, పంచాయతీ కార్యదర్శి ప్రవలిక ఆదేశాల మేరకు వాకాడులో బజారు వీధి, బీసీ కాలనీ, ముస్లిం కాలనీ వీధులలో పంచాయతీ సిబ్బంది భీమేశ్వరరావు పర్యవేక్షణలో జెసిబి ద్వారా కాలులను శుభ్రపరిచారు. రానున్న వర్షాలు దృష్ట్యా శుభ్రం చేసిన మురికి కాలువలో బ్లీచింగ్‌తో పాటు, రసాయనిక పిచికారి చేయాలని స్థానిక ప్రజలు అధికారులను కోరారు. జెసిపి తో పాటు సిబ్బంది, పంచాయతీ సిబ్బంది భీమేశ్వరరావు ఉన్నారు.

# నిరుపేదల నష్టాన్ని గుర్తించి, ప్రభుత్వం ఆదుకుంటుంది

- కళత్తూరు దళితులకు ఎస్‌సివి నాయుడు భరోసా



శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త: కెవిబిపురం మండలంలోని రాయల చెరువు తెగటంతో కళత్తూరు దళితవాడ తీవ్రంగా నష్టపోయింది.గురువారం ఉదయం చెరువు కట్ట తెగటంతో ఒక్కసారిగా వరద నీరు ఐదు గ్రామాలను చుట్టుముట్టి దిక్కులేని వారుగా చేసింది. వందలాది మూగజీవాలను విగత జీవులుగా మార్చిందని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. శనివారం ఆయన పాతపాళెం, ఒళ్ళూరు, ఎస్ఎల్ పురం, కళత్తూరు దళిత వాడల్లో విస్తృతంగా మండల నాయకులతో కలసి పర్యటించారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలకుధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా బాధితులు మాజీ ఎంఎల్ఏకు తమ గోడును వినిపించారు. క్షణాల్లో తమ గ్రామాల రూపు రేఖలు మారిపోయాయని తాము చూస్తుండగానే తమ పశుసంపద, తమ పంట పొలాల్లో బీళ్ళుగా మారాయన్నారు. తాము పెంచుకున్న పశువులు తమ కళ్ళముందే నిస్సయంగా కొట్టుకుపోతుంటే కాపాడుకోలేకపోయామని తమ ఆవేదనను వివరించారు.

**ప్రభుత్వం ఆదుకుంటుంది:**

ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.నష్టపరిహారాల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉదారంగా ఉన్నారని వివరించారు. ఇక్కడ జరిగిన నష్టాన్ని తాను స్వయంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువస్తానన్నారు. ముందుగా ప్రభుత్వంతో చర్చించి ఉదారంగా నష్టపరిహారాలను సాధించి ఆదుకుంటామన్నారు. ఇక్కడ ప్రకృతి పరంగా జరిగిన నష్టాలకు ప్రభుత్వం ఎంత ఇచ్చినా తక్కువే అన్నారు. వెంటనే చెరువు మరమ్మతులు చేసి రాబోవు వర్షాల నీటిని నిల్వ చేసుకునే రీతిలో ఉన్నతాధికారులతో చర్చిస్తామని ఎస్‌సివి నాయుడు బాధితులకు భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు మాజీ మండలాధ్యక్షులు సుబ్రమణ్యం, తెలుగుదేశం నాయకులు జయరామిరెడ్డి, సుదర్శనం నాయుడు, రమేష్, సురేష్‌నాయుడు, గోగినేని భాస్కర్‌నాయుడు, అంజూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికాస్వేచ్ఛను కాపాడటంలో

## అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి -ఏపీయూడబ్ల్యూజే ధర్నా




తిరుపతి హెల్త్, నవంబర్ 8 ప్రభాతవార్త: సమాజంలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించే పాత్రికేయుల పత్రికాస్వేచ్ఛను అధికా రులు కాపాడటంలో బాధ్యతగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ విజ్ఞప్తిచేసింది. అధికారులు సమస్యలపై గాకుండా రాజకీయంగా పాత్రికేయులపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడం మంచిదికాదన్నారు. ఇటీవల ఇద్దరు విలేఖరుల విషయంలో చిత్తూరు కలెక్టర్ వ్యవహారశైలిపై జిల్లాలోని జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.జనార్ధన్ , తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మురళి, ప్రెస్ క్లబ్ కార్యదర్శి బాలు, ఐజెయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్ర, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి చంద్రబాబు, సహాయ కార్యదర్శులు శీను బాబు, కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, బాలయ్య, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## వైభవంగా సంకటహర గణపతివ్రతం



కాణిపాకం, నవంబర్ 8 ప్రభాతవార్త: శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం సంకటహర గణపతివ్రతంను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహిస్తుంటారు. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహిం చారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి అలంక రించిన సిద్ది బుద్ధి సమేత గణనాథుని ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పవిత్రమైన సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ఆస్థాన మండపం కిక్కిరిసింది. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, ఆలయ అర్చకులు వేదపండితులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు,చిట్టిబాబు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యలతో విద్యార్థుల కుటుంబాలకు తీరని నష్టం

- జాతీయ బీసీవై పార్టీ అధ్యక్షులు రామచంద్రయాదవ్



చిత్తూరు, నవంబర్ 8 ప్రభాతవార్త: క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థులు వారి కుటుంబాలకు తీరని నష్టం చేకూరుస్తున్నారని జాతీయ బీసీవై అధ్యక్షులు రామచంద్రయాదవ్ పేర్కొ న్నారు. చిత్తూరు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల చోటు చేసుకున్న విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు, ఆత్మహత్యలపై శనివారం జాతీయ బీసీవై పార్టీ అధ్యక్షులు రామచంద్రయాదవ్ శనివారం విద్యార్థులతో ముఖా ముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాజీ టిటిడి ఛైర్మన్, మాజీ ఎంపీ డికె ఆదికేశవులు నాయుడు ఉన్నత ఆశయంలో శ్రీనివాస ట్రస్ట్ ఏర్పాటు చేసి విద్య, వైద్య రంగాల్లో విస్తృతంగా సేవలు చేస్తున్నారన్నారు. అలాంటి విద్యా సంస్థల్లో విద్యనభ్యసించే అవకాశం రావడం ఇక్కడ వున్న ప్రతి విద్యార్థికి అదృష్టం అన్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ముఖ్యంగా కళాశాలల్లో విద్యార్థులు క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడి వారి కుటుంబసభ్యులకు తీరని శోకం మిగిల్చుతున్నారన్నారు. విద్యార్థుల ఆలోచనా విధానంలో సమస్య వుందా! లేక విద్యాసంస్థలు నిర్వహిస్తున్న యాజమాన్యాల నుండి సమస్య ఉత్పన్నం అవుతుందా! లేక కళాశాలల్లో విద్యా బోధన చేస్తున్న అధ్యాపకులతో విద్యార్థులకు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయా! అనే విషయాలు తెలుసుకుని ఎదైనా సమస్య వుంటే తెలుసుకుని దానిని పరిష్కరిం చాలనే ఉద్దేశంతో ఇక్కడికి రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముఖా ముఖి కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస ట్రస్ట్ వైస్ చైర్మన్ డిఏ బద్రీనారాయణ, సీతమ్స్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ఐరాల, నవంబర్ 8 ప్రభాతవార్త: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధం కావడంతో సుమారు ఐదు లక్షల రూపాయలు విలువగల ఆస్తినష్టం జరిగిన సంఘటన మండలంలోని పుల్లూరు గ్రామ పంచాయతీ మట్టపల్లె గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు వివరాలివున్నాయి. మట్టపల్లెకు చెందిన పి.కేశవులు ఇంట్లో శనివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీనితో ఇంట్లో వున్న వస్తువులు, బీరువాలు, వంట సామాగ్రి,బంగారు,వెండి నగలు, నగదు పూర్తిగా కాలి బూడిదైంది. ఈమేరకు సుమారు ఐదు లక్షల రూపాయలు విలువ గల ఆస్తి నష్టం వాటిలినట్లు తెలుస్తోంది. ఇంట్లో వున్న వస్తువులు పూర్తిగా కాలి బూడిదవడంతో నిరుపేద కుటుంబమైన కేశవులు కట్టుబట్టలతో మిగిలింది.

## తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న



చంద్రగిరి, నవంబర్ 8 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ వాహన సేవలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

-అధికారులు, సిబ్బంది సేవలు ప్రశంసనీయం-సిఎండి శివశంకర్ లోతేటి



తిరుపతిరూరల్, నవంబర్ 8 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో ఇటీవల ఓలూరు రాయల చెరువుకు గండి పడడం వల్ల ముంపుకు గురైన ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, యుద్ధప్రాతి పదికన పునరుద్ధరణ పనులను పూర్తి చేసినట్లు ఏపి ఎస్పీడిసిఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ తెలిపారు. కెవిబిపురం మండలం పాతపాళెం వద్ద చెరువు గండి పడడంతో కెవిబిపురం 33/11కెవి సబ్ స్టేషన్ నీట మునిగిందని, ఫలితంగా కళత్తూరు, ఎస్ఎల్ పురం, పిసికెపురం, రంగయ్యగుంట, రాజులకండ్రిగ, కొటాలమిట్ట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. వరద ప్రభావంతో 223 విద్యుత్ స్తంభాలు, 78 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో మొత్తం 20.093 గృహ, వ్యవసాయ, తాగునీటి సరఫరా సర్వీసులు నిలిచిపోయాయని ఆయన వివరించారు. వరద ప్రభావం తగ్గిన వెంటనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పునరుద్ధరణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. శుక్రవారం రాత్రినాటికి 89 విద్యుత్ స్తంభాలు, 78 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు పూర్తి చేసి 1,353 సర్వీసులకు సరఫరా పునరుద్ధరించామని తెలిపారు. మిగిలిన సర్వీసులకు శనివారం విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పూర్తి చేశామని చెప్పారు. విద్యుత్ పునరుద్ధరణకు నిరంతరం శ్రమించి, రాత్రింబగళ్లు పనిచేసిన అధికారులు, సిబ్బందిని సిఎండి శివశంకర్ లోతేటి అభినందించారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425 155333కు కాల్ చేయవచ్చునని, అలాగే వాట్సప్ నెంబర్ 9133331912 ద్వారా చాట్ చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చునని తెలిపారు.

# గూడూరు డివిజన్

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి!

నాయుడుపేట, నవంబర్ 8 ప్రభాతవార్త: మండలం విన్నమాల సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. స్థానికులు ఈ సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. మృతుడు సత్యవేడు నియోజకవర్గం మదనపాలెం గ్రామానికి చెందిన నిడిగంటి చంద్రశేఖర్ (46)గా గుర్తించాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

## మెడికల్ కళాశాలల ప్రవేటీకరణ దారుణం : ఎమ్మెల్సీ

కోట, నవంబర్ 8 ప్రభాతవార్త : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రవేటీ కరణ చేయడం దారుణమని ఎమ్మెల్సీ మేరిగ్ మురళధర్ అన్నారు. శనివారం కోట మండలం విద్యానగర్ లోని నేదురుమల్లి సుబ్బారామిరెడ్డి కళాభవన్‌లో కోటీ సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మురిళీధర్ మాట్లాడుతూ మాజీ సిఎం జగన్‌మోహ్మన్‌రెడ్డి దేశ చరిత్రలో 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారని ఆయన గుర్తుశారు. అయితే వాటిని చంద్రబాబు నాయుడు ప్రవేటీకరణ చేయడం తన బీనామీలకు వాటిని కట్టబెట్టలాని చూడటం జరుగుతోందన్నారు. పేద విద్యార్థుల్లో నోట్లో మట్టికొట్టడమేనన్నారు. పేద విద్యార్దులకు వైద్య విద్య దూరం కాకుడదని 5 మెడికల్ కళాశాలల్లో తరగతులు జరుగుతున్నాయన్నారు. ఇక జరగబోవు ప్రతి ఎన్నికల్లో ప్రజలు ఈప్రభుత్వంకు గుణ పాఠం చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్దివిభాగం నాయకులు వంశీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర వైకాపా పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి, పాదర్తిరాధకృష్ణారెడ్డి, సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నరమాల వెంకటరమనయ్య, చిల్లకూరు సాయి ప్రసాద్‌రెడ్డి, రేష్మా,లిలితారెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి, పాములు సురేంద్ర,సర్పంచ్, నాగూరురెడ్డి, షనిల్‌రెడ్డి గూడలి ఉప సర్పంచ్ పల్లిముల్లు విజయసారదిరెడ్డి, జెట్పిటిసీ సభ్యులు దాసిరి కోటయ్య, కోటారెడ్డి, నాగూరు యాదవ్,సుధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం



రేణిగుంట,నవంబర్ 8 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం ఘన స్వాగతం లభించింది. జిల్లా పర్యటనకు ప్రత్యేక విమానంలో మిలటరీ డ్రస్సులో అరంగేట్రం చేసిన ఆయనకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బ రాయుడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, జనసేన సీనియర్ నాయకులు రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టేసాయి, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు స్వాగతం పలికారు అనంతరం నేరుగా విమా నాశ్రయం వీఐపీ గేటు నుండి మమండూరు బయలుదేరి వెళ్లారు. తిరుపతిలో కార్యక్రమాలు ముగించుకుని తిరిగి విమానాశ్రయం చేరుకొని అదే విమానంలో గన్నవరం తిరుగు ప్రయాణమయ్యారు. రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, రూరల్ సీఐ మంజునాథరెడ్డి తమ సిబ్బందితో రోడ్డు మార్గంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

## మద్యం సేవించి పాఠశాలకి వచ్చిన ఉపాధ్యాయుడు సస్పెండ్

తిరుపతి విద్య, నవంబర్ 8 ప్రభాతవార్త: జిల్లాలోని ఏర్పేడు మండలంలోని ఎంపిపిఎస్ ఆముదూరు పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడు సెలవులో ఉండటంతో, మండల విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఎంపిపిఎస్, పల్లం హరిజనవాడ పాఠశాలలో పనిచేస్తున్న సి.నాగరాజు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యా యుని తాత్కాలిక డిప్యుటేషన్ మీద ఆముదూరు పాఠశాలకు పంపించారు. అయితే,సదరు ఉపాధ్యాయుడు మద్యం సేవించి పాఠశాలకు హాజరై,పాఠశాల ప్రాంగణంలో పడిపోవడం,తరువాత తరగతి గదిలో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నట్లు గ్రామస్థులు, మండల విద్యాశాఖ అధికారి సమర్పించిన నివేదికల ద్వారా నిర్ధారించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి,సంబంధిత ఉపాధ్యాయుని వెంటనే విధుల నుండి సస్పెండ్ చేయబడినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ తెలిపారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆకాశదీపోత్సవం



శ్రీకాళహస్తి, నవంబర్ 8 ప్రభాతవార్త:శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందడి చోటు చేసుకుంది. శనివారం ఆలయానికి శివరాత్రిని మరిపించే రీతిలో భక్త జనం తరలివచ్చారు. హరనామస్మరణతో పునీతం చేసారు. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తజ నుల సందడే సందడి అన్నట్లు మారింది. కాగా శనివారం శనీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించటం ఆనవాయితి ఈ నేపధ్యంలో స్వామికి అభిషేకాలు,అర్చనలు జరిపారు. కాగా సాయంత్రం కోట మండపం వద్ద భక్తి శ్రద్దలతో సంప్రదాయ బద్ధంగా ఆకాశదీపాన్ని ఆలయ డిప్యూటి ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి దంపతులు ఆవిష్కరించారు. ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తుండగా ఆకాశదీపాన్ని ఆవిష్కరించారు. ఆలయ పర్యవేక్షకులు నాగభూషనం యాదవ్ పర్యవేక్షించారు.

## తిరుపతిలో నగరసంకీర్తనతో మరింత భక్తిభావం



తిరుపతి,నవంబర్ 8ప్రభాతవార్త: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ప్రతి శనివారం ఉదయం నిర్వహించే నగర సంకీర్తన భక్తుల్లోనూ ఆధ్యాత్మిక భావం పెంపొందించేలా ఉందని రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున నగర సంకీర్తనలో భాగంగా గోవిందరాజస్వామి ఆలయ మాఢవీధుల్లో రంగస్థలి కళాకారులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, వాసుదేవరెడ్డి, భాస్కరాచారి, మురళి, మధు, పద్మావతి, మునికృష్ణారెడ్డి, గంగప్ప, మునినాథరెడ్డి, అరుణమ్మ, జయమ్మ, సిద్దమ్మ, పద్మావతి, విగ్రహాల కల్యాణి, సుశీల, మునికుమారి, పద్మావతి, కల్పన,ఉషారాణి, పార్వతి, శాంభోలు హరినాథ్, పొన్నాల జేజిరెడ్డి, తదితరులు కళాకారు లతో కలసి నుదుటిన నామం ధరించి భక్తితో భజనలతో నగరంలో గోవింద నామ సంకీర్తనలు హోరెత్తాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. నగరసంకీర్తనతో నగరంలో ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తున్నారు.

## శ్రీవారి దర్శనం సంతోషం



తిరుమల,నవంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని కార్తీక మాసంలో శనివారం దర్శనం చేసుకోవడం అంతా శుభకరమని మాజీమంత్రి ఆర్‌కె రోజా విశ్వాసం వ్యక్తం చేశారు. వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## చేతులకు గ్లౌజ్‌లు ధరించి అన్నప్రసాదం వడ్డించాలి

-టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి



తిరుమల,నవంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి: తిరుమ లలో అన్నప్రసాదం భవనంలో భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించే సమయంలో చేతులకు గ్లౌజ్‌లు ధరించాలని, శుచిగా చేపట్టాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. భక్తులకు మరింత మెరుగైన సేవలందించేందుకు, సమాచారం కోసం కల్యాణకట్ట, లడ్డూవితరణ కౌంటర్‌ల వద్ద హెల్ప్‌డెస్క్‌లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

## ప్రయాణీకుల భద్రత,మర్యాదపూర్వక ధోరణి అవసరం



తిరుపతి,నవంబర్ 8ప్రభాతవార్త: తిరుపతి యాత్రాస్థలం కావడంతో ఇక్కడకు వచ్చే యాత్రికులు పట్ల ఆటోడ్రైవర్లు వారి భద్రత, మర్యాదపూర్వంగా వ్యవహరిం చాలని టిడిపి రాష్ట్ర అధికారప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తెలిపారు. రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఆటోడ్రైవర్లు పార్కింగ్ సమస్యలు ఎదుర్కొంటున్నారని, అనధికార దుకాణాల వల్ల ట్రాఫిక్ తీవ్రమైందని పలువురు ఆటోడ్రైవర్లు డాక్టర్ బాలసుబ్రమణ్యంకు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైల్వేస్టేషన్ వద్ద సుదర్శన్‌స్టాండ్‌ను శనివారం మధ్యాహ్నం టిడిపినేత పెరుమాళ్ మధు,ఐఎస్ ఖాజాతో కలసి పరిశీలించారు. ఆటోయూనియన్ సభ్యులతో స్నేహపూర్వకంగా పలకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అక్కడే నిర్మాణంలో ఉన్న రైల్వేస్టేషన్‌నుకూడా ఆయన పరిశీలించారు. ప్రయాణీకుల సౌకర్యాలు, ఆటోడ్రైవర్లు భవిష్యత్తు రెండూ ఆధారపడిఉన్నాయన్నారు. అక్రమంగా ఉన్న దుకాణాలను తొలగించేలా కమిషనర్‌ను కలసి వివరిస్తానని డాక్టర్ బాలసుబ్రమణ్యం తెలిపారు.

## కార్తీక శనివారం పూజలందుకొన్న వైష్ణవీమాత



చౌడేపల్లి, నవంబర్ 8 ప్రభాతవార్త: మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్లలో గల వైష్ణవీమాతా ఆలయంలో కార్తీక శనివారం పూజలను సాంప్రదా యబద్ధంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ ప్రధానార్చకురాలు శ్రావణీ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభి, నారికేళాభిషేకాలు కన్నుల పండుగలా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించాడు.